మాధవరావు మేస్టారు

మాధవరావు మేస్టారు బట్టతల గోక్కుంటూ పేపర్లు దిద్దుతున్నారు. 'వెధవలు–చదువు మీద శ్రద్ధ ఏదీ సూడెంట్లుకి? ఒక్క డికి అక్షరం ముక్క రాదు గదా– ఏబీసీడీలు కాదు అ ఆలు రాని వెధవలంతా వచ్చేస్తున్నారు పదో తరగతిలోకి– అలా వెళ్ళి పోతున్నారు ఇంటర్ మీడియేట్ లోకి– ఆ పైకి కూడా– స్పెల్లింగ్ తప్పు లేకుండా తనపేరు రాసుకోవడం రాని వాళ్ళు............ డిగ్రీ హోల్డర్లయి పోతున్నారు. కోపం వచ్చేసింది మేస్టారికి, అసలు యింగ్లీషు చదువు ఎత్తేస్తే బావుణ్ణు- యీ మాటలు ఆయన రోజా అనుకునేవే. వెనకటికి ఆయన డిఫెన్స్‌లో పనిచేస్తున్న రోజుల్లో ఒకాయన అనేవాడు "జాబ్ శాటిన్‌ఫాక్షన్ అనేది లేకపోతే ఉద్యోగం చెయ్యడం కష్టం అని, ఉపాధ్యాయ వృత్తి అనబడే మేస్ట్రుజ్యోగంలో జాబ్ శాటిస్‌ఫాక్షన్ ఆయన కేమీ కనబడ్డంలేదు.

ఆ రోజులు జ్ఞాపకం వచ్చాయి.

'అందులోనన్నా వున్నాను కాను ఈ పాటికి ఏదో రాంక్‌లో వుందును. బోలెడు జీతం వచ్చును. సరే అప్పట్లో అది బాగులేదు, బాగులేదంటూ ఏడవక పోలేదు. జంతువులన్నా నయమే, ఒకోసారి ఎదురు తిరుగుతాయి– ఏ స్వేచ్ఛా లేదు– దిక్కుమాలిన ఉద్యోగంలో. నెలలో మాంచి ఎండలో కాకి యూనిఫారమూ– ఫుల్ బూట్సూ, నెత్తిన టోపీ పెట్టుకుని గంటల తరబడి డ్యూటీ అంటే మజాకానా? కాస్త బుర్ర తిప్పితేచాలు ఆఫీసరు రుద్రుడయిపోయి తిట్టి పోసేసేవాడు. అక్కడితో సరా? డిసిప్లినరీ యాక్షన్ కూడానూ. ఒకసారి మార్చింగ్ చేస్తున్నప్పుడు తాను నవ్వాడని పెరేడ్ గ్రౌండ్ చుట్టూ డజన్‌సార్లు పరిగెత్తమన్నాడు. గేదెలా మొహమూ వాడూనూ, మరి నవ్వురాదూ? నవ్వినా తప్పేనా?' యిప్పుడు వొళ్లు మండి కుర్రాళ్లని తిడుతూ వుంటే పడీ పడీ నవ్వుతూ వుంటారొకోసారి.

మాధవరావు గారికి నవ్వొచ్చింది. హాయిగా నవ్వుకున్నారు, బట్టతల గోక్కుంటూనూ.

వెధవ పేపర్లు దిద్ది ప్రాణం విసుగెత్తి పోతోంది, ఒకోసారి ఆ రాతలకి నవ్వలేక ప్రాణం పోతోంది.

"యిదేం దిక్కుమాలిన యిల్లండీ- నిన్న మీరు పెట్టిన కాంపోజిషన్ పుస్తకాలకి చెదలు పట్టేశాయి. యిల్లుమార్చండీ అంటే వింటారా?" అని కోపంగా పుస్తకాలకట్ట దులిపింది లక్ష్మి- మేస్టారి భార్య. ఆవిడ ఆ పుస్తకాల కట్టని దులిపినట్టే అప్పుడప్పుడు మొగుణ్ణి దులిపేస్తూ వుంటుంది.

నిజమే ఈ కొంపలో చెదలే వున్నాయా? చీమలేవున్నాయా? పంది కొక్కులే వున్నాయా? నల్లులేవున్నాయా, పిల్లులేవున్నాయా? యింతపెద్దయిల్లు ఎనభయి రూపాయలకి దొరికిందంటే మాటలా? నూటయాభై రూపాయలిచ్చినా యివ్వరూ యివ్వరు.

అన్నానికి చీమలు పట్టేస్తాయి. చీమలు పట్టిన (లేకపడిన) అన్నమూ, మజ్జిగాతింటే కంటికి చాలా మంచిదట! తలకు నూనె రాసుకుని పడుకుంటే తలకి పట్టేస్తాయి చీమలు– మెదలకుండా కాస్సేపలా పడుకుంటే మనుషుల్నే తినేస్తాయి కూడానూ.

గడ్డం గీసుకుంటూ వుండగా బిలబిలమంటూ ప్రైవేటు పిల్లలు వచ్చారు. ఓ పక్క గడ్డం గీసుకుంటూనే వాళ్లకు తలా ఒకపనీ అప్పగించాడు! "ఒరే నువ్వు కోటింగ్ పద్యం చదువు, నువ్వు ఫలాని పాఠం చివరి గ్రామరు ఎక్సరసయిజు చెయ్యి, నువ్వు స్పెల్లింగులు కంఠతంతా బట్టు..... అన్నట్టు నువ్వీనెల జీతం తెచ్చావుకావింకానూ, ఒరే నువ్వు, నెయ్యి తెచ్చిపెట్టమన్నాను తెచ్చావూ– డబ్బులకేన్రా బాబూ–

పోనీ నెల జీతం బదులు సీసాడు నెయ్యి తెచ్చీ– ఒరే నువ్వు పరుగెత్తికెళ్ళి స్నానానికి వేణ్ణీళ్లు పెట్టమన్నానని అమ్మగార్తో చెప్పు– లేకపోతే నువ్వే....''

"స్నానం చేసొచ్చి నాండిటెయిల్డు పాఠం చెబుతాను..... రేపు మాత్రం అందరూ కాంపోజిట్ లెక్కలు తెచ్చుకోండి. ఆలకించారా అందరూనూ? ఆలకించావురా వొరే పేట కరణం? నువ్వురా ఒరే కోటిగా?......

గడ్డం గబగబ బరికేశారు మా.మే.

డిఫెన్స్‌లో వున్నప్పుడు గడ్డం పెరిగినట్టు కనబడిందా తోలు వల్చేసేరన్న మాటే. మిలటరీవా మజాకావా?

ఆ వుద్యోగంలో జాబ్ శాటిస్ ఫాక్షన్, ఐరన్ డిసిప్లిన్– ఈ దిక్కుమాలి మేస్టరు ఉద్యోగంలో తగలబడ్డం వచ్చింది ఇంతానూ– తెల్లారి లేచింది మొదలు రాత్రి నిద్రపోయేదాకా గుండెకాయ తెగపోయేలా అరవడం అంటే మాటలుకాదు.

"మీకేమండీ ఇంగ్లీషు మేస్టర్లూ– క్లాసు టీచర్లూనూ– మా మొహం ఎవడు చూస్తాడు" అంటారు తెలుగు మేస్టారు ఆచార్లుగారు.

"ఊరుకోండి బాబు మా హిందీ అపాటి చూడ్రు" అన్నారు ముసలి హిందీ మేస్టారు. పాపం ఆయన్ని గుంటలు తన ఆట పట్టించేస్తారు. ఏడిపించుకుతినేస్తారు. మొదటి బెంచీలో కూర్చుని పుస్తకం అడ్డు పెట్టుకుని కుక్కలా అరిచేవాడొకడూ పందిలా అరిచే వాడొకడూనూ. ఒక డ్రాయింగు మేస్టారికయితే "పూరీ కూర" అని పేరు పెట్టారు. మరో మేస్టారు పేరు "దిమిలి పొడుగు మనిషి"

–పోతారు మన్ను గొట్టుకుని.

మాధవరావు మేస్టారు స్నానం చేసి ఇంగ్లీషు నాండిటెయిల్డు పాఠం ప్రారంభించారు. తన ప్రైవేటు దుకాణం కుర్రాళ్లని ఒక్కొక్కళ్ళనీ లాకు పోతున్నాడు కొత్తగా వచ్చిన లెక్కల మేస్టారు తాతారావు. ఆ కుర్ర మేస్టరుకి ఎందుకో అంత డబ్బుపిచ్చి. తనయితే ఈ ప్రైవేట్లరంధి మానుకుందామనుకున్నాడు. గాని అప్పులో? అవి తీరాలి ఎలాగా?

మర్చంట్ నేవీలో పనిచేస్తూ లెక్కలేనంత డబ్బు పంపిస్తూ వుండే తమ్ముడు అర్ధాంతరంగా మాయమయ్యాడు. వేలు డిపాజిట్ కట్టి లీగల్ హెయిర్ (న్యాయసమ్మతమైన వారసుడు) సర్టిఫికెట్ తెస్తే– రెండు వాయిదాల్లో లక్ష రూపాయల నష్ట పరిహారం యిస్తానన్నారు. ఆ తమ్ముడికి పెళ్ళి కాలేదు గనక తల్లే వారసురాలు (తండ్రి ఏనాడో చచ్చిపోయాడు తాగుడలవాటయిపోయి) తల్లి పేరుమీదుగా పది కట్టడానికి– మరొక వెయ్యి తన ఖర్చులు పెట్టడానికి. అన్నదమ్ములు అందుకు రాలేదు. మావల్లకాదంటే, మావల్లకాదని సన్నాయి నొక్కులు నొక్కేరు. నానా బాధలూ పడి– హవ్వ– చెప్పుకుంటే సిగ్గు. పెళ్ళాం పుస్తెల్తో సహా అమ్మేసి– పదివేలూ మాధవరావే కట్టేడు (అప్పటికి బంగారం తులం ఆరొందలే) ఇంతలో ముసలి తల్లికి బబ్బు–జబ్బంటే జబ్బుకాదు– సరిగ్గా సంవత్సరం పైగా తీసుకుంది. పత్రాలు తయారయ్యే సరికి సంతకం పెట్టడానికేనా మిగుల్తుందో లేదో ననుకున్నారు. తీరా సొమ్ము వాటాలు వేసి పంచుకుందుకి అన్నదమ్ములూ (అప్పచెల్లెళ్ళు తక్కువ తన్నారా?) తయారు....

అసలు, నిజం చెప్పాలంటే ఆస్తి వున్నవాడికి అన్నదమ్ములే ఆగర్భ శత్రువులు. ఈ ముక్క భారతం చదివినప్పుడు తెలీలేదు – అనుభవంలో తెలిసింది మాధవరావు గారికి....

చివరికి మిగిలిందేమిటి? పదివేల రూపాయల అప్పులూ, బట్టతలానూ... ఇది చాలక ఇల్లు బట్టిన అప్పచెల్లెలూను. మాధవరావు గారికి అట్టే వయసు కూడా లేదు. నలభయి నాలుగో, నలభయ్యయిదో వుంటాయి. ఒడ్డూ పొడుగూ మనిషి మాంచి దిట్టంగా వుంటాడు. ఇప్పుడేం చూశారు? డిఫెన్స్‌లో

పనిచేసే టప్పుడుండేవాడూ ఓహో! ఇంకా బలంగా వుండేవాడు. అందులో సగం శరీరం లేదిప్పుడు. అయినా ఏడ్చి పోతున్నారు కొందు వెధవలు.

"చూశారూ నిన్ననే తెచ్చారు రెండు కేజీల మంచినూని– బోలెడు డబ్బుపోసి– పందికొక్కులు– మార్చండీ బాబూ యీ ఇల్లూ అందాటేవిట్రమ" అన్నది విసుక్కుంటూ లక్ష్మి. ఆవిడకి అట్టే వయసుండదు. అయినా చాలామంది లక్ష్మి అనడం మానేసి లక్ష్మమగారు అంటారు. మొన్ననో బామ్మగారు నూతిదగ్గరికి వచ్చి 'లక్ష్మమక్కయ్యగారు' అనడం మొదలు పెట్టింది. బుద్ధీజ్ఞానం లేక పోతేసరి– వయస్సు పెరిగినకొద్దీ చిన్న వాళ్ళం కావాలన్న ఆలోచన ఆడవాళ్లకి మరీలావు– అక్కయ్య గారన్నా అంటుంది, అమ్మమ్మగారన్నా అంటుంది.

'యిల్లు మార్చెయ్యాలి– నిజమే మార్చెయ్య వలిసిందే– కానెలాగ? ఈ యింట్లో ముందుభాగాన్న పెద్ద వరండా వుంది. దానికి కట కటాలు కూడా వున్నాయి. (అది మాధవర్రావు గారికి బంది ఖానాలా కనిపిస్తూ వుంటుంది) ప్రైవేట్లు చెప్పుకుందికి బాగుంది. ఒక పెద్దగదీ మరో చిన్నగదీ కాక– వేరే వంటకొట్టుంది. పెరట్లో నుయ్యుంది. తులసికోటుంది. స్నానానికీ దానికీ (?) మరుగుంది. పాత కాలపు యిల్లయిన మాట నిజమే. అప్పుడప్పుడు పెంకులు రాలుతున్న మాట నిజమే, వానాకాలంలో పైనుంచి కురవడమే కాక కాస్త పెద్ద వానయితే నీరు యింట్లోకే వచ్చేసే మాట కూడా నిజమే– కానేం జేస్తాం– కాలక్షేపం చెయ్యక తప్పదు.

ఆ మధ్యనొకసారి బాబిగాడిచొక్కా కొరికేశాయి ఎలకలు. కొత్తచొక్కా. జేబులో కొబ్బరుండలు దాచుకుని వంకిని తగిలించాడు. ఆ చొక్కా కిందపడి పోయింది. ఎలకలుంచుతాయా? అయినా వాడికేం తెగులూ? పన్నెండేళ్లొచ్చాయి కదా– ఎనిమిదో తరగతి వెలగ బెడుతున్నాడు గదా– కొబ్బరుండలు, అందులో ఒకటి కొరికి మరీనూ– జేబులో వేసుకోవడం ఏమీ? లక్ష్మి వాణ్ణి పట్టుకొని నాలుగుతికేసింది. ఆ మర్నాడు సునీత రిబ్బన్లు...... ఆమర్నాడు తనదే, సవరం, కూరగాయలు తెచ్చుకునే నైలాను సంచీ...... యిప్పుడెవర్నివుతుకుంది లక్ష్మి? వుతికినా ఏమిఫలము రామరామా, విశ్వదాభి రామరామా–

ఇంచుమించు ప్రతీ ఆదివారం ఇల్లు శుభ్రంచెయ్యడం, మంచాలు దులపడం ఒక కార్యక్రమం. అన్నీ యిన్నీ నల్లులూనూ? వెనకటికి ఎవరో జమీందారు గారు– నల్లుల్ని చంపనిచ్చేవాడు కాదట. సుష్టుగా భోజనంచేసి పడక కుర్చీమీద వాలి కునుకు తీసేవాడట. కుప్పలకొద్దీ నల్లులు కుర్చీతాలూకా అన్ని మూలల్నించీ వచ్చి ఆయన శరీరంనిండా పట్టేసేవట. అలా ఒక అరగంట అయిపోయాక వెళ్ళిపోయేవట. అవి వెళ్ళగానే ఆయనకి మెలుకువొచ్చేసేదట. ఇలా నల్లులమీదా పిల్లులమీదా, పాములమీదా కప్పలమీదా అపారమైన దయకురిపించే జమీందార్లూ యితర ధనికులూ, ఆరుగాలమూ కష్టించే రైతుల్ని, పాలేర్లనీ పెట్టే కష్టాలన్నీయిన్నీకావనీ, జలగలకంటే హీనంగా వాళ్ళ రక్తమాంసాలు పీల్చడానికి ఏవిధంగానూ జంకరనీ మాధవరావుగారికి తెలీదు. అంచేత తను చిన్నప్పుడు విన్న ఈ కథ చెబుతూ వుంటాడు తరచుగా పెళ్లాంతో.

"మంచిదేకదూ– మీరూ పెంచండి పోనీ నల్లుల్ని" అని కసురుతుంది లక్ష్మి. పడుకుంటే ఒకోసారి తల వెంట్రుకల్లోకి కూడా దూరిపోతున్నాయి నల్లులు. పిల్లులూ అలాగే కాల్చుకు తింటాయి. తెల్లవార్లూ ఎలకలవేటా, చంటి పిల్లలు ఏడిచినట్టు అరుపులూనూ.

దుప్పట్లు, తలగడాలూ ఎండన వెయ్యడం, కిరసనాయిలు డబ్బా, పప్పుడబ్బాలు వగైరాలు బాగా శుభ్రంచేసి నీరు ఓడి పోయేదాకా ఆరబెట్టడం ఒక పక్క సాగుతూ వుండగా మరోపక్క మంచాలు దులపడం సాగుతూ వుంటుంది.

మంచాన్ని దులుపుతూ లక్ష్మి మొగుణ్ణి కూడా దులిపేస్తూ వుంటుంది. "ఎప్పుడయినా చిన్నమెత్తు బంగారం కొన్నారా? వరలక్ష్మి వ్రతం చేయించుకుంటాను ఒక్క అణా ఎత్తు బంగారం కాసు చేయించమంటే వినిపించుకోరు. మీరెప్పుడూ కష్టాల గురించీ అప్పుల గురించీ మాట్లాడతారు. అప్పులో అప్పు అదే తీరకపోతుందా? మీకంటె తక్కువజీతం వచ్చే ఆ గుమస్తా సుందర్రావు పెళ్లాన్ని చూశారుకారు– మొన్ననే చెవులకి కొత్త రకం దుద్దులు చేయించుకుంది. ఎలాంటెలాంటి చీరలు కడుతుందో!– ఏమయినా మేష్టర్లకంటే గుమాస్తాలే నయం–"..... ఇదీలక్ష్మి వరస.

ఒక్కపక్క గంజిలేక మాడుతున్నా సరే జనాలకి బంగారం మీదా కొత్తబట్టల మీదా వుండే మోజు గురించి మాధవరావు గారు చాలా సేపు ఆలోచించారు. "అప్పులమీద అప్పులు చేసి అయినాసరే పిసరంతయినా బంగారం కొనడానికో, కొత్త బట్టలు కొనుక్కోవడానికో ఎగబడతారు. అప్పు ఎలా తీరుతుందో అన్న చింత వుండదు.... బంగారం మళ్ళీ అప్పు తెచ్చుకోవడానికీ పనికొస్తుంది. మరి కొత్తబట్టలు.....? ఆలోచన ఎంతకీ తెగదు...... ఆవలింతల్తో ఎటో పోతుంది. మాధవరావు మేష్టారు నిద్రలో కుంభకర్ణుడికంటే పైచెయ్యే–

ఆ నిద్ర డిఫెన్స్ సర్వీసులో పని చేస్తున్న రోజుల్లో అలవాటయి పోయింది. రెండు రోజులు– అనగా దాదాపు యాభై గంటలు కంటిమీద కునుకు లేకుండా వుండిపోగలడు. వీలు దొరకాలే గాని రోజుల తరబడి కటికనేలమీద గానీ, కంకరరాళ్ళ గుట్టమీదేగానీ వొళ్ళు తెలియకుండా నిద్రపోగలడు.

అటువంటిది–

కొత్తగా చేరాయి చిన్నచిన్న చుంచెలకలు - మేష్టారి కాలి బొటనవేలు కొరికేసి పోయాయి, అర్ధరాత్రిపూట లేచి కూచున్నాడు.

ప్రాణం జివ్వుమని లాగేసినట్టయింది. అంత మనిషీ గిలగిల లాడిపోయాడు.

అతనిక్కోపం వచ్చేసింది చుంచెలక మీద. కనిపిస్తే చంపేసిపోను. ఎందుక్కనబడవూ - ఎదురు గుండానే గంతులు వేస్తూ పారిపోతుంటాయి. కళ్ళ ఎదురుగానే నానా అల్లరీ చేస్తూ, పరిక్షల్లో పబ్లిగ్గా (లేక పబ్లిగ్గా పరీక్షల్లో) కాపీ చేస్తూ నువ్వేం చెయ్యగలవు అన్నట్టు పోజు పెట్టే స్టూడెంట్లలాగ. తనకి చాత గాలేదు గాని ఆ స్టూడెంట్లవల్ల మేష్టర్లు కొందరు బాగు పడుతున్నారు కాంట్రాక్టు పద్ధతిని కాపీలు రాయించి.

ఇంతకీ చుంచెలక....

బుర్రంతా చిరాగ్గా వుంది. నరాలన్నీ కోపంగా వున్నాయి. మనసంతా బాధగావుంది. చుట్టూ చీకటిగా వుంది. చాలా చాలా నిశ్శబ్దంగా వుంది.

నిస్సహాయత - వెధవ చాతకానితనం మెతకదనం - మొహమాటం - కాదు చాతకానితనమే. అవునవును. తానిలా వుండ బట్టే తననందరూ వాజమ్మని చేస్తారు.

యింట్లో చుంచెలకలు, నల్లులు, పిల్లులు, చెదపురుగులు 'బొద్దింకలు' చీమలు -

అన్నదమ్ములు - సరే - సరే - వాళ్ల నేనాడో లెక్క వేసుకున్నాడు, అప్ప జెల్లెళ్లు -

చిన్నప్పుడు చండశాసనుడైన తండ్రి, ఆయనకికాస్త పక్షపాత బుద్ధి. తనకంటే మొన్న చచ్చిపోయిన తమ్ముడిమీదే ఎక్కువిష్టం -

తరవాత అల్లా డిఫెన్స్ ఉద్యోగంలో వున్నప్పుడు ఆఫీసర్లు - తోడి సబార్డినేట్స్ -

యిప్పుడీ మేష్టరు గిరీలో చీమ్మిర పకాయల్లాంటి కుర్రవెధవలు కొందరు మా కానివాళ్లుంటారు - బాగా తెలివి తేటలు ప్రదర్శిస్తూ వేలెడంత ఉన్నవాళ్లే ఎప్పటికయినా చిక్కు-పెద్ద శరీరం కల మొద్దులు పరమసాత్త్వికంగా వుంటారు-

ఇతర మేస్టర్లు - ముఖ్యంగా తన ప్రైవేట్లకి దెబ్బ కొడుతున్న ఆ తాతారావు -

కేజికి వందేసి గ్రాములు తక్కువ తూచే కోటాదుకాణం (లేక చౌకడిపో) వాడు, అన్నీ మొదటి రకం రేట్లువేసి అధమాధమ రకం అంటగట్టే కిరాణా కొట్టువాడు (లేక ఖాతా కొట్టువాడు) ప్రైవేటు డబ్బులు ఎక్కొట్టే కొందరు కలవారి పిల్లలు....

అంతా దగా దగా

అసలీ మనుషులే అంత

ఈలోకమే అంత

మెతగ్గా వుంటే మొత్తేస్తారు, మోసేస్తారు

మరంచేత మెతగ్గా వుండకూడదు వాజమ్మలా వుండ కూడదు, నీతల్లో జేజెమ్మతో చెప్పుకో అన్నట్టుండాలి.

వెన్నలా వుండకూడదు, వెధవలా వుండకూడదు.

వజ్రంలా వుండాలి

వాడిగా వేడిగా వుండాలి.

కాలి బొటునవేలు జివ్వున లాగుతోంది కోపం వచ్చేసింది మాధవరావు మేస్టారికి,

చుంచెలక మొదలు చౌక డిపోదాకా, కుర్రాళ్ల మొదలు కిరాణాకొట్టు వాడిదాకా అందరి మీదా, అంధరి మీదా కోపం వచ్చేసింది.

ఎర్రగా, వేడిగా కోపం కణతల్లోంచి కళ్ళలోకి నిండింది. మాధవరావు మేస్టారికి కోపంతో ఉష్ణం వచ్చేసినట్టయింది.

అందర్నీ ఓ పట్టుపట్టిచూడాలి. ఆంఫట్– బట్టబర్ర గోక్కుంటూ వెధవ నంగిరి మరి పనికిరాదు.

ఉదయం నూతి గట్ట మీద స్నానం చేస్తూ కుడిపాదం మడమ మాత్రమే నేలకానించి బొటనవేలు పైకెత్తి దాని మీద చల్లని నీళ్ళు పోసుకుంటున్న మొగుణ్ణి వంటింటి కిటికీలోంచి చూసింది లక్ష్మి,

బొటనవేలు వాచి వుంది.

"ఏమిటయ్యింది మీ బొటనవేలుకి? మిమ్మల్నే......" అని గావుకేక పెట్టినట్టుగా అరిచింది– కిటికీ ఊచలకి తలాన్చి బయటికి చూస్తూ.

మాధవరావు మేస్టారికాకేక వినిపించట్లేదు. బొటనవేలు మీద అలా చల్లని నీరు పోసుకుంటుంటే ఎంత సైతుగా సుఖంగా వుందీ....?

రచనాకాలం : 1980

ప్రచురణ : జ్యోతిమాసపత్రిక, 1982, (కొన్ని మార్పులతో)